గన్‌పార్కులో అమరవీరుల స్థూపానికి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ సర్పంచులు

అభివృద్ధికి నజరానా మిత్తీలా?

అప్పులుచేసి అభివృద్ధి చేశాం..

- కాంగ్రెస్ హామీలు నీటి మూటలేనా
- పెండింగ్ బిల్లులు విడుదల చేయండి
- నియోజకవర్గానికి 100 మంది చొప్పున లోక్‌సభ బరిలోకి దిగుతాం
- ప్రభుత్వానికి సర్పంచ్‌ల సంఘం హెచ్చరిక

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 22: గ్రామ పంచాయతీలను అప్పులు తెచ్చి అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దామని, తక్షణమే తమ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. బిల్లులు విడుదల చేయకుంటే లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కో సీటు నుంచి వంద మంది పోటీ చేస్తామని హెచ్చరించింది. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్‌ల సంఘం గురువారం హైదరాబాద్‌లో ఆందోళనకు దిగింది. నల్లజెండాలు, మెడలో నల్ల కండువాలు ధరించిన సర్పంచ్‌లు పబ్లిక్‌గార్డెన్ నుంచి అమరవీరుల స్థూపం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గన్‌పార్కులోని అమరవీరుల స్థూపానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఆ తరువాత అసెంబ్లీ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు వారిని అరెస్టు చేసి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ గ్రామాలలో డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, క్రీడా ప్రాంగణాలు, పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు తదితర పనుల కోసం అప్పులు తెచ్చి అభివృద్ధి చేశామని చెప్పారు. చేసిన పనులకు ప్రభుత్వం నుండి సకాలంలో బిల్లులు రాకపోవడంతో ఇటీవల కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని.. అయినప్పటికీ పాలకులు నిధుల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం నుంచి పంచాయతీలకు రూ.1200 కోట్ల వరకు రావాల్సి ఉన్నదని చెప్పారు. సర్పంచ్‌ల కాలపరిమితి అయిపోవడంతో స్పెషల్ ఆఫీసర్లకు అధికారాన్ని కట్టబెట్టిన ప్రభుత్వం.. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా మౌనం దాల్చడం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు. చేసిన అప్పులకు మిత్తీలు కట్టలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి చేసినందుకు మిత్తీలు కట్టాలా అని ప్రశ్నించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గ్రామాలలో పాదయాత్రలు చేసిన కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కకు పెండింగ్ బిల్లుల గురించి నివేదించామని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చిన నాయకులు నేడు మంత్రి పదవుల్లో ఉంటూ తమను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో సర్పంచ్‌ల బిల్లులపై అనేక మార్లు ఆరోపణలు, విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు బిల్లుల గురించి మాట్లాడటం లేదని అన్నారు. శాసనసభ సమావేశాల్లో సైతం పెండింగ్ బిల్లుల ప్రస్తావన లేకపోవడం శోచనీయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇప్పటివరకు రెండుసార్లు వినతి పత్రం సమర్పించామని, అయినా కూడా స్పందన లేదని చెప్పారు. ఇదే ధోరణి కొనసాగితే వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో ప్రతి నియోజకవర్గంలో వందమంది సర్పంచ్‌లు పోటీలో నిలుస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. ఈ ఆందోళనలో సర్పంచ్‌ల సంఘం నాయకులు కొలను శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కే విజయ్‌రెడ్డి, ఒగ్గు గణేశ్, మునగాల ప్రభాకర్‌రెడ్డి, కేశబోయిన మల్లయ్య, కుంభం కరుణాకర్, మామిడి వెంకన్న, కాచం శ్రీనివాసరెడ్డి, లావుడ్య వెంకన్న, సల్ల నారాయణ, బాలు నాయక్, ఎల్లాచారి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

తాగునీళ్లివ్వండి మహాప్రభో!

- నీటికోసం కేఆర్ఎంబీకి లేఖ రాయనున్న రాష్ట్ర ప్రభుత్వం
- వేసవిలో సమస్య రాకుండా కార్యాచరణ
- ఏపీ సాగుకు నీటిని తరలించొద్దు
- నీటివనరులను పునరుద్ధరించాలి
- పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి, పుర పాలక, నీటిపారుదల శాఖలు కలిసి సమన్వయంతో పని చేయాలి
- మిషన్‌భగీరథపై సమీక్షలో సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): వేసవికాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, అందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి తాగునీటి కోసం కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు (కేఆర్ఎంబీ) లేఖ రాయాలని సూచించారు. రాబోయే వేసవిలో తాగునీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సాగునీరు, పట్టణాభివృద్ధి, పురపాలక, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరాశాఖల అధికారులతో సచివాలయంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. జలాశయాల్లో నీటి నిల్వలు, వేసవిలో తాగునీటికి అవసరమైన నీటి పరిమాణం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి నివాస ప్రాంతానికి తాగునీరందేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. తాగునీటి కోసమంటూ నాగార్జునసాగర్ నుంచి ఏపీ 9 టీఎంసీలకుపైగా నీరు తీసుకుపోతున్నదని, అంతపెద్ద మొత్తంలో తాగునీరు ఎక్కడ వినియోగిస్తున్నారో సరైన గణాంకాలను తీసుకోవాలని, ఇతర అవసరాలకు ఆ నీరు తీసుకుపోకుండా చూడాలని అధికారులకు సూచించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి తాగునీటికి నీరు తీసుకునేందుకు వెంటనే కేఆర్ఎంబీకి లేఖ రాయాలని ఆదేశించారు. చివరి అవకాశంగా నారాయణపూర్ జలాశయం నుంచి నీటి విడుదల కోరుతూ కర్ణాటకను అభ్యర్థించాలని తెలిపారు. నిరుపయోగంగా మారిన నీటి వనరులను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అందుకు కాగ్నా నదిని ఉదహరించారు. అవసరమైన చోట తాగునీటి బోర్లు, బావులు, మోటర్లకు మరమ్మతులు చేయించాలని, ఎమ్మెల్యేలకు కేటాయించిన ఏసీడీపీ నిధుల నుంచి రూ.కోటి, అవసరమైతే అంతకన్నా ఎక్కువగా వినియోగించుకోవాలని, జూలై ఆఖరి వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అందుకు అన్ని జిల్లాల కలెక్టర్లతో రెండు రోజుల్లో సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలోని సిబ్బంది వేతనాలను విడుదల చేయాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోనూ తాగునీటికి ఎలాంటి సమస్య లేకుండా చూడాలని కోరారు. నగరంలోని నీటి అవసరాలపై సూక్ష్మస్థాయిలో సమీక్షించి తగిన ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వేసవి పూర్తయ్యేవరకూ తాగునీటి ట్యాంకర్ల రాకపోకల విషయంలో పోలీసుల నుంచి ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. సమీక్షలో ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్టుపై కేఆర్ఎంబీ బృందానికి వివరాలను వెల్లడిస్తున్న ఎన్ఎస్‌పీ ఎస్ఈ నాగేశ్వర్‌రావు

సాగర్‌ను పరిశీలించిన కేఆర్ఎంబీ బృందం

నందికొండ, ఫిబ్రవరి 22 : నాగార్జునసాగర్ ప్రాజెక్టును కేఆర్ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) బృందం సభ్యులు గురువారం సందర్శించారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా ఎస్ఈ వరలక్ష్మి, ఈఈ శివశంకర్‌తో కూడిన బృందం సభ్యులు ఎన్ఎస్‌పీ ఎస్ఈ నాగేశ్వర్, ఈఈ మల్లికార్జున్‌తో కలిసి నాగార్జునసాగర్ డ్యాం గ్యాలరీ, క్రస్ట్ గేట్ల రోప్స్, రబ్బర్ సీలింగులు, కుడి కాల్వ గేట్లు, స్పిల్‌వే, సూట్ గేట్లు, ఆటోమేటిక్ మెషీన్లను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్యామ్ నిర్వహణ పనుల పరిశీలనలో భాగంగా సందర్శించినట్టు తెలిపారు. శుక్రవారం జల విద్యుత్తు కేంద్రాలను పరిశీలించనున్నట్టు పేర్కొన్నారు. వీరి వెంట ఎన్ఎస్‌పీ డీఈఈ శ్రీనివాస్, ఏఈలు కృష్ణయ్య, సత్యనారాయణ ఉన్నారు.

కోటా ప్రకారమే తాగునీళ్లు

- అదనపు జలాలను కేటాయించడం కుదరదు
- రాష్ట్ర సర్కారుకు తేల్చిచెప్పిన కేఆర్ఎంబీ
- నీటివిడుదలకు ససేమిరా అంటున్న ఏపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): తాగునీటి కోసం అదనపు జలాలను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని కేఆర్ఎంబీ తిరస్కరించింది. త్రిసభ్య కమిటీలో తీసుకున్న నిర్ణయం ప్రకారం కేటాయించిన నీటి కోటాకే పరిమితం కావాలని స్పష్టం చేసింది. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అదనపు జలాలను కేటాయించడం కుదరదని తేల్చిచెప్పింది. మే మాసాంతం వరకు ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించి అంశంపై కేఆర్ఎంబీ మెంబర్ సెక్రటరీ, తెలంగాణ ఈఎన్సీ మురళీధర్, ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డితో కూడిన త్రిసభ్య కమిటీ గత అక్టోబర్‌లో సమావేశమైంది. శ్రీశైలం ప్రాజెక్టు ఎండీడీఎల్‌ను 805 ఫీట్లు, సాగర్ ఎండీడీఎల్‌ను 505 ఫీట్లకు నిర్ణయించి, వేసవి ఆవిరి నష్టాలను కూడా లెక్కగట్టి మొత్తంగా రెండు ప్రాజెక్టుల్లో 82.78 టీఎంసీలు వినియోగానికి అందుబాటులో ఉన్నాయని ఆ కమిటీ తేల్చింది. అందులో 2.78 టీఎంసీలను జూన్, జూలై తాగునీటి అవసరాలకోసం రిజర్వ్ చేసింది. మిగిలిన 90 టీఎంసీల్లో 35 టీఎంసీలను తెలంగాణకు, 45 టీఎంసీలను ఏపీకి గత అక్టోబర్‌లోనే త్రిసభ్య కమిటీ కేటాయించింది. కోటా నీటిలో తెలంగాణ 31.17 టీఎంసీలను జనవరి 30వ తేదీ నాటికే వినియోగించుకున్నది. మే మాసాంతం వరకు తాగునీటి కోసం మొత్తం 8.90 టీఎంసీలు అవసరమవుతాయని, ఆ మేరకు నీటిని విడుదల చేసేందుకు అనుమతివ్వాలని తెలంగాణ సర్కారు ఇటీవలే కేఆర్ఎంబీకి లేఖ రాసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ అభ్యర్థనపై అభిప్రాయం చెప్పాలని ఏపీ సర్కారుకు బోర్డు లేఖ రాసింది. అయితే తెలంగాణ ఇప్పటికే 35 టీఎంసీలకు మించి 36.80 టీఎంసీలను వినియోగించుకున్నదని, ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అదనపు జలాలను కేటాయించేందుకు అంగీకరించబోమని ఏపీ సర్కారు స్పష్టంచేసింది. అదే విషయాన్ని తెలుపుతూ బోర్డు తాజాగా తెలంగాణకు లేఖ రాసింది. అదనపు జలాల కేటాయింపు కుదరదని స్పష్టంచేసింది.

గురుకులాల్లో మళ్లీ బ్యాక్‌లాగ్‌లు తప్పవా?

- రీలిక్విష్మెంట్‌పై తొలగని సందిగ్ధత
- ఏ నిర్ణయమూ తీసుకోని ట్రిబ్
- పూచీకత్తు లేకుండానే నియామకాలు
- ఆందోళనలో మెరిట్‌లిస్ట్ అభ్యర్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి12 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకులాల్లోని అన్ని క్యాటగిరీల పోస్టుల్లో మళ్లీ బ్యాక్‌లాగ్‌లు ఏర్పడే పరిస్థితి కనిపిస్తున్నది. అందుకు తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) చేపట్టిన పోస్టుల భర్తీ ప్రక్రియనే ప్రధాన కారణం. రీలిక్విష్మెంట్‌పై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో తమకు తీరని అన్యాయం జరుగుతుందని మెరిట్‌లిస్ట్ అభ్యర్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

రీలిక్విష్మెంట్ లేకుండానే..

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో తొమ్మిది క్యాటగిరీల్లో మొత్తంగా 9,210 పోస్టుల భర్తీ ప్రక్రియను ట్రిబ్‌కు అప్పగించగా, గత ఆగస్టులోనే రాత పరీక్షను నిర్వహించింది. అన్ని పోస్టులకు 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితాలను కూడా సిద్ధం చేసింది. అయితే ఎన్నికల కోడ్, కోర్టు కేసుల నేపథ్యంలో తాత్కాలికంగా ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రధాన అడ్డంకులు తొలగిపోవడంతో ట్రిబ్ ఇటీవలనే మళ్లీ నియామక ప్రక్రియను ప్రారంభించింది. అయితే ఇప్పటికే పీజీటీ, స్కూల్ పీడీ, లైబ్రేరియన్ పోస్టులకు మెరిట్ జాబితాలను విడుదల చేసి, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసింది. ఇటీవలనే ఉద్యోగాలకు ఎంపికైన వారి నుంచి రీలిక్విష్మెంట్‌ను తీసుకోకుండానే ట్రిబ్ నియామకపత్రాలను అందజేస్తున్నది. రీలిక్విష్మెంట్ ప్రకారం గురుకులాల్లోని పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు దాదాపు మూడేండ్ల వరకు ఉద్యోగాన్ని వదిలిపోబోమని, ఒకవేళ అదే జరిగితే రూ.లక్ష జరినామా చెల్లిస్తామని, ఆ ఉద్యోగాన్ని మెరిట్ జాబితాలో ఉన్న తదుపరి అభ్యర్థికి ఇచ్చేందుకు అంగీకరిస్తూ ఒప్పందపత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం అభ్యర్థుల నుంచి ఎలాంటి పూచీకత్తు లేకుండానే ట్రిబ్ నియామక ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తుండటం గమనార్హం.

బ్యాక్‌లాగ్‌లు తప్పవా?

పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు డీఎల్, జేఎల్‌కు ఎంపికయ్యే చాన్స్ ఉన్నది. దీంతో అత్యధికులు పీజీటీని వదులుకొని జేఎల్, డీఎల్ వైపు మొగ్గుచూపుతారు. ఫలితంగా పీజీటీ పోస్టులు ఖాళీ అవుతాయి. దీంతో ఆ పోస్టులన్నీ బ్యాక్‌లాగ్‌లో పడిపోతాయి.

నిర్ణయం తీసుకోని సర్కారు

రీలిక్విష్మెంట్ అంశంపై ప్రభుత్వం ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇదే విషయమై ట్రిబ్ అధికారులను సంప్రదించగా రీలిక్విష్మెంట్ అంశంపై ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు రాలేదని చెప్తున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే అమలు చేస్తామని వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం నియామక పత్రాలనే అందజేస్తున్నామని, పోస్టింగ్‌లు ఇచ్చే సందర్భంలో రీలిక్విష్మెంట్‌ను తీసుకొనేందుకు అవకాశం ఉన్నదని పేర్కొంటున్నారు. అభ్యర్థులు మాత్రం రీలిక్విష్మెంట్ తీసుకున్న తరువాతనే నియామక ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకుని తమకు న్యాయం చేయాలని, లేదంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని 1:2 మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులు హెచ్చరిస్తున్నారు.

గొర్రెల స్కాంలో నలుగురి అరెస్టు

మొదటిపేజీ తరువాయి...

నమోదవగా.. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఏసీబీ అధికారులు లోతుగా విచారణ జరిపారు. పశుసంవర్ధక శాఖకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్, కామారెడ్డి ఏరియా వెటర్నరీ హాస్పిటల్ డాక్టర్ డీ రవి (ఏ 3) మేడ్చల్ డీవీ అండ్ ఏహెచ్‌వో డాక్టర్ ఎం ఆదిత్య కేశవసాయి (ఏ 4) రంగారెడ్డి జిల్లా భూగర్భ జల అధికారి పసుల రఘుపతిరెడ్డి (ఏ 5), వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ సంగు గణేశ్ (ఏ 6) కొందరు ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కయ్యి, నకిలీ ఖాతాలు సృష్టించి దాదాపు రూ.2.10 కోట్ల ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని ఏసీబీ అధికారులు తేల్చారు. ఈ నలుగురు అధికారులు ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం తీసుకురావడంతో అరెస్టు చేసినట్టు తెలిపారు. అరెస్టు అనంతరం నలుగురిని ఏసీబీ కోర్టు హాజరుపర్చారు. కోర్టు వారికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. గొర్రెల పంపణీ పథకం కోసం ప్రకాశం జిల్లాకు చెందిన 18 మంది నుంచి గొర్రెలను కొనుగోలు చేయడంలో పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు కేశవసాయి, రవి.. రంగారెడ్డి జిల్లాకు చెందిన గొర్రెల పంపిణీ కాంట్రాక్టర్లు మోయినుద్దీన్, ఆయన కుమారుడు ఇక్రమ్‌తో కలిసి మొత్తం 133 యూనిట్ల (ఒక్కో యూనిట్‌కు 21 చొప్పున)ను కొని, ఆ డబ్బును తమకు చెల్లించలేదని ప్రకాశం జిల్లాకు చెందిన ఏడుకొండలు అనే వ్యక్తి గచ్చిబౌలి స్టేషన్‌లో గతంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని పరిశీలించిన పోలీసులు ఎస్ఐఆర్‌లో ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు కాంట్రాక్టర్లుగా ఉన్న తండ్రీ కొడుకులను నిందితులుగా పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కేసును ఏసీబీ విచారణ చేపట్టి.. నలుగురిని అరెస్టు చేసింది.

లోకం పోకడ



ఏప్రిల్ నెలలో మాత్రం రంచనుగా ఒకటో తేదీనే జీతాలు వేస్తారట!

రాష్ట్రానికి చల్లటి కబురు

బంగాళాఖాతం ఈశాన్యంలో వాయుగుండం

24 నుంచి 26 వరకు వర్షాలు కురిసే చాన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : చలికాలం నుంచి ఒక్కసారిగా పెరిగిపోయిన పగటి ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా నగరంలోని ప్రజలు ఎండల ధాటికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో వాతావరణ శాఖ రాష్ట్ర ప్రజలకు తీపి కబురు అందించింది. బంగాళాఖాతంలో ఈశాన్యం నుంచి వాయుగుండం ఏర్పడటం, తేమ కారణం వల్ల రాష్ట్రంలోని తూర్పు ప్రాంతాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. తూర్పు తెలంగాణలో ఈ నెల 24 నుంచి 26 మధ్య వర్షాలు కురిసే అవకాశం ఉన్నది తెలిపింది. కాగా, హైదరాబాద్‌లో కొన్ని వారాలుగా వేసవి తరహా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	12.5°c	38.2°c
రంగారెడ్డి	13.8°c	37.4°c
మెదక్	15.8°c	36.8°c
హైదరాబాద్	19.0°c	33.0°c
నిజామాబాద్	19.4°c	35.2°c
మహబూబ్‌నగర్	20.7°c	37.0°c
నల్లగొండ	21.0°c	37.6°c
వరంగల్	21.0°c	34.0°c
కరీంనగర్	21.0°c	34.0°c
ఖమ్మం	22.0°c	35.0°c

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ బ్యాంక్‌లో..

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 3000
- **తెలంగాణలో–** 96, ఏపీలో 100 ఖాళీలు ఉన్నాయి.
- **శిక్షణ కాలం:** ఏడాది
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 6
- **వెబ్‌సైట్:** https://www.centralbankofindia.co.in

రైట్స్ లిమిటెడ్‌లో...

ప్రభుత్వ సంస్థ రైట్స్ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 10
- **పోస్టులు:** జనరల్ మేనేజర్, ఏడీజీ, సీనియర్ మేనేజర్
- **విభాగాలు:** సివిల్, మెకానికల్, సస్టెయినబుల్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.rites.com

ఈఎస్ఐసీలో...

హైదరాబాద్‌లోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ)లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 4
- **పోస్టులు:** అసిస్టెంట్ ఇంజినీర్, జూనియర్ ఇంజినీర్
- **విభాగాలు:** ఎలక్ట్రికల్, సివిల్
- **నోట్:** రిటైర్డ్ ఇంజినీర్స్ ఈ పోస్టులకు అర్హులు
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.esic.nic.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- హిస్టరీ (డీఎస్సీ), యూపీఎస్సీ ప్రిలిమ్స్ విశ్లేషణ, జనరల్ స్టడీస్ (గ్రూప్స్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.